కథ

-జె. పవన్ వెంకట కృష్ణ

చురుకైన చూపుడు వ్రేలు

నొక్కావలసిన అడ్రస్ అదే..!

మెల్లగా గేటు తీసుకుని వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాను. క్షణంలోనే తలుపులు తెరచుకున్నాయ్. డేగ కళ్ళూ, పెద్ద పెద్ద మీసాలూ ఉన్న ఆజానుబాహుడు వచ్చి "ఎవరు కావాలి?" అడిగాడు.

"నమస్తే సార్..నా పేరు రంగారావు. తెనాలినుంచి వస్తున్నాను. వెంకటపతిగారు కావాలి" అన్నాను వినయంగా.

ఆయన ప్రతి నమస్కారం చేసి ''నేనే వెంకటపతిని లోపలికి రండి'' అన్నాడు.

''తెనాలి స్టేట్‌బ్యాంక్‌లో పనిచేస్తున్నా న్సార్. ఈ ఊరికి ట్రాన్స్ఫరయింది. ఇల్లు కావాలి. తెనాలిలో లాయర్ రామలింగేశ్వర రావు మీకు తెలుసుట కదా. మీకు ఈ ఊళ్ళో చాలా ఇళ్ళున్నాయనీ- మిమ్మల్ని కలు సుకుంటే సులువుగా ఇల్లు దొరుకుతుందని తనే చెప్పాడు''

ఆయన నొసలు ముడివేసి- కళ్ళు చిన్నవి చేసి ''రామలింగేశ్వర్రావంటే... సి.టి.ఒ. బాబూరావుగారి బావ మరిదేనా?'' అని అడిగాడు.

''అవునండీ!'' అన్నాను నేను వినయంగా.

ఆయన కుతూహలంగా సోఫాలో ముందుకు వంగి ''వాళ్ళంతా బావు న్నారా..ముఖ పరిచయాలేం లేవు గానీ..మా ఫ్యామిలీ గురించి వాళ్ళకూ, వాళ్ళ ఫ్యామిలీల గురించి మాకూ ఈ మధ్యనే తెలిసింది'' అంటూ నవ్వి ''వసుంధరా!'' అంటూ లోపలికి వినబడేలా పిలిచాడు. ఆ పిలుపులో ఏమైనా కోడ్ ఉందేమో..ఆయన భార్య కాబోలు నౌకరు కుర్రాడితో ట్రేలో కాఫీలు పెట్టించుకు వచ్చింది. మా ఇద్దరికీ కాఫీ కప్పులు స్వయంగా అందించి తను భర్త ప్రక్కన సోఫాలో కూర్చుంది. నేను మళ్ళీ వినయం ఉట్టిపడేలా నమస్కారం చేసి థాంక్స్ చెప్పి కాఫీ సిప్ చేయసాగాను. మా ఫ్యామిలీ గురించిన వివరాలన్నీ ఒక్కొక్క టిగా అడిగి తెలుసుకోసాగిందావిడ. ఇంతలో హఠాత్తుగా...

''అవునూ..ఇక్కణ్ణించి ట్రాన్స్ఫరయిన ఎంప్లాయీ ఖాళీ చేసిన ఇల్లుంటుం దిగా..అది ట్రై చెయ్యకపోయారా?'' అన్నా డాయన ఏదో గుర్తొచ్చినట్టు.

గతుక్కుమన్నాన్నేను..అది ఊహించని బాంబు! అయినా నేను తెలివైనవాణ్ణి..అట్టే కంగారుపడలేదు.

''అదీ ట్రైం చేశాం సార్. ఆ ఇంటి ఓనర్ గారి బంధువులెవరో వస్తున్నారట. ఇల్లు ఎవ రికీ ఇవ్వం అన్నారట'' అన్నాను.

వెంకటపతిగారి కళ్ళు మరింత చిన్నవ య్యాయ్.

''ఆయనకి ఏ ఊరు బదిలీ అయింది? ఈ ఊరునుంచి ఎప్పుడు వెళ్ళారు?'' అడి గాడు.

''ఎప్పుడు వెళ్ళారో తెలియదుగానీ, గుంటూరు ట్రాన్స్ఫరయిందని మాత్రం తెలుస్సార్!'' అన్నాను.

వెంకటపతిగారి భార్య ఏదో అనబో యింది. వెంకటపతిగారు చప్పున ఆమె వైపు చూసి-

''పోనీలే..మన పచ్చమేడలో క్రింద పోర్షన్ ఖాళీగానే ఉందిగా..అది వీరికి ఇవ్వొచ్చులే'' అంటూ ఆమె చేతి మీద చెయ్యి వేశారు. ఆమె ఏదో అర్థమైనట్టు-

''ఇల్లు చూసుకుంటారా? శుభ్రం చేసి రెడీగానే ఉంది. రేపే మీ వాళ్ళను తీసుకు వచ్చే యొచ్చు'' అంది.

నాకు మనసులో ఇల్లు చూడాలనే ఉంది. కానీ పైకి మాత్రం-

''అబ్బే..మీరు బావుంటుందంటే..ఇక చూసేదేముంది!'' అన్నాను వినయంగా.

ఇంతలో లోపల్నుంచి ఒక అందమైన యువకుడు హాల్లోకి వచ్చి-

''డాడీ! సైట్ దగ్గరికెళ్ళమంటారా?'' అని అడిగాడు.

అతను చాలా అందంగా ఉన్నాడు. గూఢ చర్యం చేసి చూసిన మా రామలింగేశ్వర్రావు కన్ను అతడి మీద పడ్డంలో ఆశ్చర్యం లేదని పించింది. నాకే కూతురుంటే..నేనూ పోటీలో ఉందుననిపించింది.

వెంకటపతిగారు నా గురించి చెప్పి వాళ్ళ బ్బాయిని పరిచయం చేశాడు.

''వీడు మా చిన్నబ్బాయ్ శశికిరణ్. నాతోపాటే నా కాంట్రాక్ట్స్, కనస్ట్రక్షన్స్ చూస్తుంటాడు. పెద్దబ్బాయ్ రవికిరణ్ సెక్ర టేరియట్‌లో చేస్తున్నాడు. అమ్మాయి భర్తతో అమెరికాలో ఉంది'' అని నవ్వి ''వీడికే బాబూరావుగారి అమ్మాయి సంబంధం తెచ్చాడో మధ్యవర్తి. పిల్లని చూడ్డా నికి వెళ్దాం అనుకుంటుండగానే ''మూఢం వచ్చేసింది'' అన్నాడు.

ఆ అబ్బాయి సిగ్గుపడుతున్నట్టు 'బై' చెప్పేసి గబగబా వెళ్ళిపోయాడు.

అనుకున్న 'సీక్వెన్స్' చాలా తొందరగానే ఎదురయ్యింది.

''బాబూరావుగారి అమ్మా యినా?'' అని ఆశ్చర్యం ప్రక టించాను.

వెంకటపతిగారు మరోమారు నొసలు ముడివేసి ''ఏం?'' అన్నాడు నిదానంగా.

''అబ్బే..ఏంలే దేం లేదు!'' అన్నాను ఏదో ఉందనిపించేలా!

''ఫర్వాలేదు ఏమైనా ఉంటే ముందే చెప్పండి. తర్వాత తెలియడంకన్నా ఇదే మంచిది కదా?!'' అంది వెంకటపతిగారి భార్య.

నేను వాచీ చూసుకుని ''బ్యాంకుకి టైము యిపోతోంది సార్..'' అంటూ నీళ్ళు నమి లాను.

''లేదే..ఇంకా అరగంట టైముంది. మా కారులో డ్రాప్ చేస్తాలెండి'' అన్నాడాయన.

''నా మాటల వల్ల ఈ సంబంధం తప్పి పోతే ఆ పాపం నాకంటుకుంటుంది'' అంటూ చాలా ఇబ్బంది వ్యక్తపరిచాను.

''నేనెప్పుడూ ఇతరుల మాటల మీదే ఆధారపడను. మా అందరికీ స్వంత ఆలోచ నలుంటాయ్..భయపడకండి!'' అంటూ నవ్వుతూ హామీ ఇచ్చాడాయన.

''బాబూరావుగారి అమ్మాయి మంచిదే సార్. కానీ కొంచెం లావు. ఇష్టమైన వాళ్ళు బొద్దుగా ఉంటుందంటారు. పడనివాళ్ళు 'రోడ్‌రోలర్' అంటారు. అందువల్లే సంబంధాలు కూడా రావడం లేదంటారు. అదీగాక బాబూరావుగారి చెల్లెలు. పెళ్ళయిన రెండేళ్ళకే భర్తపోతే- ఉద్యోగం చేసుకుంటూ, వాళ్ళ ఆఫీసులోనే పనిచేసే మరో కులం వ్యక్తితో కలిసి ఉంటోందట. పెళ్ళి చేసుకోలేదు కానీ కాపురం చేస్తున్నారు. అందువల్ల కూడా సంబంధాలు చెడిపోతున్నాయ్‌ట'' అన్నాను నిజాలు చెప్పలేక చెపుతున్నట్టు బాధపడుతూ.

''ఛీ...ఛీ! అదేం పని'' అంటూ మొహం చిట్లించింది వసుంధర.

వెంకటపతిగారు ఏదో ఆలోచిస్తూ సూటిగా నా కళ్ళలోకి చూడసాగారు. కొంప తీసి నా మీద ఏమైనా సందేహం వచ్చిందా! అనే అనుమానం వచ్చింది నాకు.

''అయినా ఇంత అందమైన అబ్బాయికి..ఆ అమ్మాయి..ప్చ్!'' అని ఆగి ''అన్నట్టూ రామలింగేశ్వర్రావుగారి అమ్మాయి గురించి ఎవరూ చెప్పలేదా మీకు, అతను కూడా కూతురి పెళ్ళి ప్రయత్నాల్లోనే ఉన్నాడే?!'' అన్నాను సాలోచనగా. వెంకటపతిగారి మొహంలో ఏ మార్పూ లేదు. కానీ వసుంధర మొహంలో కుతూహలం కొట్టొచ్చినట్టు కనిపించింది.

''మా ఊళ్ళో ఆ అమ్మాయి కాలేజీ బ్యూటీ అంటారు. అంత అందంగా ఉంటుంది. మా అబ్బాయికన్నా ఏడాది సుమారు పెద్దదికాక పోతే- కాణీ కట్నం లేకుండా మా కోడలు చేసుకునే వాళ్ళం. అయినా లోటేం చెయ్యరు లెండి. ఒక్కతే కూతురు కదా, మొత్తం ఆస్తి అంతా ఆమెదే!'' అన్నాను.

వసుంధర మొహం వెయ్యి కాండిల్స్ బల్బులా వెలిగిపోతోంది.

''అంత బావుంటే మంచి రోజులు రాగానే వాళ్ళింటికే వెళ్ళొచ్చు పెళ్ళిచూపులకి'' అంటూ సోఫాలోంచి లేచింది. తన మాటే ఫైనల్ అన్నట్టు.

వెంకటపతిగారి మొహంలో అప్పుడు ఆశ్చర్యం కనిపించింది.

''తప్పు వసుంధరా బాబూరావుగారింటికి వస్తామని మాటిచ్చాం!'' అన్నాడు.

''ఇది పెళ్ళండీ బొమ్మలాట కాదు'' అంటూ ఆవిడ లోపలికెళ్ళిపోయింది.

వెంకటపతి ఎడమ చేతి రెండు వేళ్ళతో నుదుటి చుట్టూ రాసుకుంటూ-

''పదండి మిమ్మల్ని బ్యాంకు దగ్గర డ్రాప్ చేస్తాను'' అన్నాడు.

మనసులోనే నన్ను నేను అభినందించుకుంటూ లేచాను.

★ ★ ★

ఇక్కడ రామలింగేశ్వర్రావు గురించి కొంచెం చెప్పాలి.

మేమిద్దరం చిన్నప్పటి నుంచీ స్నేహితులమే. నేను కొంచెం తెలివైనవాణ్ణే- కానీ వాడు చాలా తెలివైనవాడు. ఎన్నో విషయాల్లో తన మాటే పై నుండేలా నన్ను ఇన్ఫ్లుయెన్స్ చెయ్యగలిగేవాడు. నాకూ వాడివి చాలాసార్లు వెధవ్వాక్కులైనా సరే వేదవాక్కుల్లా అనిపించేవి. అందుకే ఈ ఎక్స్‌ప్లెనేషన్. తప్పని తెలిసినా వప్పుకున్నాను. అసలేం జరిగిందంటే..! కొద్దిరోజుల క్రితం రామలింగేశ్వర్రావు బావగార



మ్మాయిని, ఈ వెంకటపతిగారి అబ్బాయికి ఇచ్చి చేస్తే బాగుంటుందని 'ప్రపోజల్' తెచ్చాడు ఓ మధ్యవర్తి.

పెళ్ళిచూపులు ఏర్పాటు చేద్దాం అనుకునే సరికి మూఢం అడ్డొచ్చింది. ఈ లోపులో మేనకోడలి క్షేమం కోరి పెళ్ళికొడుకు వివరాలన్నీ రహస్యంగా కూపీలాగాడు లాయర్ మేనమామ! వివరాలన్నీ తెలిశాక ఆలోచనలో పడ్డాడు ఆ క్రిమినల్ లాయర్. నాకు విజయవాడ ట్రాన్స్ఫరయిందని వినగానే ఎగిరిగంతేసి ఓ క్రిమినల్ ఆలోచన చెప్పాడు.

ఆశ్చర్యపోయిన శ్రియ

రజనీకాంత్‌తో 'శివాజీ' సినిమాలో నటిస్తున్న శ్రియకి ఆ సినిమా షూటింగ్ నిమిత్తం స్పెయిన్ వెళ్లే చాన్స్ వచ్చింది. అక్కడ షూటింగ్ జరుగుతున్నప్పుడు రజనీకాంత్ గురించి, అతనితోపాటు తన గురించి కూడా అక్కడి పేపర్లలో వార్తలు రావడం తనకి ఎంతో సంతోషాన్ని కలిగించిందని బోల్డు సంబరపడుతూ చెప్తోంది శ్రియ. నిజంగా రజనీకాంత్‌గారి గురించి అక్కడి వారికి కూడా తెలియడం తనకు ఆశ్చర్యం కలిగించిందని, నిజంగా రజనీగారు గ్రేట్ అంటూ తెగ పొగిడేస్తోంది శ్రియ.



విని అదిరిపడ్డాను నేను ''ఛీ..స్వంత చెల్లెలి కూతురి సంబంధం చెడగొడతావా?'' అన్నాను ఆశ్చర్యంగా. బదులుగా నవ్వాడు.

''న్యాయాన్యాయాలూ, ధర్మాధర్మాలూ ఆలోచించే వృత్తిలోనా ఉన్నాన్నేను? ఎంతోమంది రెడ్‌హేండెడ్‌గా దొరికిపోయిన హంతకుల్ని నిర్దోషులుగా విడిపించాను. ఎందరో నిర్దోషులు జైళ్ళపాలయ్యారు. వాటితో పోలిస్తే ఇదేమంత తప్పేమీ కాదు. పెళ్ళికొడుకు ఓ క్లయింట్, సమర్థుడైన లాయర్‌ని ఎన్నుకునే ఛాయిస్ అతనికి ఉంది. అతడో 'కన్స్యూమర్'. మంచి 'ప్రోడక్ట్'ని సెలక్ట్ చేసుకోవడం అతని హక్కు. అదీగాక మా బావగారి ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్‌లో కొన్ని లూప్ హోల్స్ ఉన్నాయి. ఆ విధంగా చూసినా మనదే మంచి సంబంధం. మనం మంచిని ఆఫర్ చేస్తున్నాం అంతే..ఇందులో ''చెడగొట్టడం ఏమీ లేదు'' అని నవ్వి ''పైగా ఆ పని 'నేనుగా' చెయ్యను'' అంటూ ఒక ప్లాన్ చెప్పాడు చాలా వివరంగా.

కంప్యూటర్ ప్రోగ్రామింగ్ జరిగినట్టు ఆ క్షణంలో నా మెదడు, చెవులు మాత్రమే పని చేశాయ్. అక్కడ హృదయానికి స్థానం లేదు.

ఆ ప్లాన్ ప్రకారమే అద్దె ఇంటి నెపంతో వెంకటపతిగారితో పరిచయం చేసుకుని, పద్మశ్రీ లెవెల్లో నటించి, కథని మాక్కావల సినట్టు మలుపుతిప్పాను. ఫలితంగా రామలింగేశ్వర్రావిచ్చిన గ్రాండ్ పార్టీ తీసుకుని మర్నాడే విజయవాడకు మకాం మార్చేశాను.

★ ★ ★

రెండు రోజుల తర్వాత ఒకనాడు సాయంత్రం బ్యాంకు నుంచి వచ్చాక చేతిలో టీకప్పుపెట్టి నెత్తిమీద బాంబు పేల్చింది మా ఆవిడ.

''మీ బ్యాంకు నుంచి గుంటూరు ట్రాన్స్ఫరైన వాళ్ళ ఫ్యామిలీ కూడా ఈ పోర్షన్లోనే ఉండే వారటండీ!''

నా నెత్తిన పిడుగు పడినట్లైంది. త్రాగబోయిన టీ తొణికి మీదపడి పోయింది. బట్టలు ఖరాబయిపోయాయి. నేను అబద్ధం ఆడిన సంగతి వెంకటపతికి తెలిసిపోయిందన్నమాట! తెలిసీ ఏమీ మాట్లాడలేదంటే? నా వళ్ళంతా చెమటలు పట్టేశాయి. ఒక్క అబద్ధంతో నా విలువను నేనే ఎంత దిగజార్చేసుకున్నానో అర్థమై..నామీద నా తెలివి తక్కువతనం మీద నాకే అసహ్యం వేసింది.

''అరెరె బట్టలు పాడైపోయాయండీ!'' అని కంగారుపడింది మా ఆవిడ.

'ఖరాబైంది బట్టలు మాత్రమేనా..మర్యాదే ఖరాబైపోయింది' అనుకున్నాను బాధగా..జరిగిన విషయాలేవీ ఆమెకు తెలియవు.

మర్నాడే బ్యాంకులో ఇద్దరు ముగ్గురుతో 'అర్జంటుగా ఇల్లు' కావాలని చెప్పాను. వాళ్ళు నా వైపు ఓ వెర్రి వెధవను చూసినట్టు చూశారు.

★ ★ ★

ఆ రోజు ఆదివారం టీవీలో 'పంచతంత్ర' వస్తోంది. మా 'కుతంత్రాలు' గుర్తొచ్చి మనసులో దిగులుగా ఉంది. సరిగ్గా అప్పుడే ఇంటి ముందు కారాగిన శబ్దం వినిపించింది. ఎవరా అని చూశాను! వెంకటపతి?

నా గుండె ఆగినట్టయింది. ఈ ఇంట్లోకి వచ్చిన దగ్గర్నుంచీ ఆయనకి కనిపించకుండా తప్పించుకు తిరుగుతున్నాను. దేవుడా ఇవాళ దొరికేసేను!

కారులోంచే పిలిచాడాయన. ''రంగారావుగారూ..ఇవాళ ఆదివారం. మీరు ఖాళీయే కదా..అలా వెళ్ళొద్దాం రండి!'' అంటూ 'ఆర్డర్'లా పిలిచాడు.

నా నోరు ఎండిపోయింది. ఔనని కానీ కాదని గానీ అనలేని స్థితిలో అప్రయత్నంగానే షర్ట్ వేసుకుని వెళ్ళి, వెర్రినవ్వు నవ్వి కారులో కూర్చున్నాను.

''సత్యనారాయణపురంలో ఓ పనుండి బయలుదేరాను. కొంత దూరం వెళ్ళాక మీకొకటి చూపించాలని గుర్తొచ్చి వెనక్కొచ్చాను'' అన్నాడు డ్రైవ్ చేస్తూ.

ఏమీ మాట్లాడకుండా కూర్చోవడం ఇబ్బందిగా ఉంది. మాట్లాడడానికి నోరూ పెగలడం లేదు. ముళ్ళమీద కూర్చున్నట్టుంది నా పరిస్థితి.

వెంకటపతి మాత్రం మా బ్యాంకు గురించి రాజకీయాల గురించి తన కాంట్రాక్టుల్లో లాభనష్టాల గురించి ఏవేవో

మాట్లాడుతూనే ఉన్నాడు.

మనసు ఆనందంగా ఉంటే సమయం తెలియకపోవునేమో కానీ, నేనున్న పరిస్థితిలో ఒక యుగం తర్వాత కారు ఓ పాత కాలం నాటి భవనం ముందాగింది. దిగి ఆయన వెనుకే లోపలికి నడిచాను. లోపల మనుషులున్నారు కానీ అలికిడి లేదు. అంతా చాలా కామ్‌గా ఎవరి పనివాళ్ళు చూసుకుంటున్నారు. ఇద్దరు ముగ్గురు వ్యక్తులతో ఏదో మాట్లాడి, కొన్ని కాగితాల మీద సంతకాలు పెట్టించుకున్నాడాయన. మాకు యాపిల్ ముక్కలూ, షర్బత్తూ ఇచ్చారు. వచ్చేసే ముందు వెంకటపతినా చెయ్యి పట్టుకుని ఆ హాల్లో ఒక ప్రక్కన ఉన్న టేబుల్ దగ్గరికి తీసుకెళ్ళాడు. దానిమీద అక్వేరియం లాంటి ఒక గాజు తొట్టె ఉంది. ముందు అదేదో డెకరేటివ్ పీస్ అనుకున్నాను. కానీ దగ్గరకు వెళ్ళి చూస్తే నాకు మతిపోయింది. అందులో ఏదో ద్రవంలో ఒక మనిషి చేతి వ్రేలు ఉంది! అర్థం కాక అయోమయంగా వెంకటపతి వైపు చూశాను. ఆయన గోడకున్న, ఓ అరవై ఏళ్ళ వయసు గల గంభీరమైన వ్యక్తి ఫోటో వైపు చూపించాడు మౌనంగా.

తిరుగు ప్రయాణంలో కారు కొంత దూరం వెళ్ళాక నెమ్మదిగా చెప్పడం మొదలు పెట్టాడు.

''ఇందాక నేను చూపించిన ఫోటోలోని వ్యక్తి ఒకప్పటి జమిందారు..నాగభూషణం గారు..ఆ గాజుతొట్టిలో ఉన్నది ఆయన కుడి చేతి చూపుడువ్రేలు. చురుకైన చూపుడు వ్రేలు!'' అని ఆగాడో క్షణం.

ఆయన మనిషి మంచివాడే- కానీ ఛాందసులు, అత్యంత సాంప్రదాయవాది!

తన దగ్గర పనిచేసే వాళ్ళతో సహా కుటుంబం అంతా తన కనుసన్నల్లో ఉండాలనుకునే వాడు. అందరూ నియమబద్ధంగా నిప్పుల్లా ఉండాలని శాసించేవాడు. ఎవరు ఏ చిన్న తప్పు చేసినా వ్రేలెత్తి చూపించి విమర్శించేవాడు. ఆ ఒక్క చెడ్డగుణం వల్లే ఆయనెంతో పోగొట్టుకున్నాడు.

ఒకసారి వాళ్ళ పాలేరు ఫకీరయ్య అనేవాడి కూతురు ఎవరితోనో ప్రేమలో పడిందట. ఆ సంగతి వాళ్ళ పెద్దవాళ్ళకంటే ముందే నాగభూషణంగారి చెవిలోనూ, ఓ మసక చీకటి రాత్రి ఆయన కంట్లోనూ పడింది. అంతే ఇరువైపుల కుటుంబాలకీ పనిలేకుండా చేశారు. తీవ్రంగా దూషించారు. ఆ రాత్రే ఆ అమ్మాయి వంటిమీద కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. ఆ నిప్పు ఆమెనే కాక నాలుగు పూరిళ్ళనూ మరో ఇద్దరు మనుషుల్నీ కూడా బూడిద చేసేసింది. ఆయనకి అది చాలా పెద్ద షాక్! ఆ తర్వాత మరోకొద్ది రోజులకి మరో ఘోరం జరిగిపోయింది. ఆయన చిన్నకూతురు తండ్రిమీద తిరుగుబాటు చేసి ఎవరితోనో వెళ్ళిపోయింది.''

నాకేదో అస్పష్టంగా అర్థమవుతోంది. మనసంతా అనీజీగా తయారయింది.

''మంచానపడ్డ నాగభూషణంగారి మనోవ్యధలోంచి వచ్చింది ఆ ఆలోచన. ప్రయోగశాలల్లో 'స్పెసిమన్స్'ని ద్రావకాల్లో భద్రపరిచినట్టు, తన చూపుడు వ్రేలిని కోసి ఎంత ఖర్చయినా సరే తరతరాల వరకూ భద్రపరచాలని వీలునామా రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకులు తండ్రి ఆజ్ఞని ఇప్పటికీ తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు. వాళ్ళెవరూ ఇతరుల తప్పుల్ని ఎత్తి చూపరు. ఎవరి బ్రతుకులు వాళ్ళని బ్రతకనిస్తారు.

రంగారావుగారూ ఇందులో ఒక విషయం గమనించారా? తమ ఘనకార్యాలను శిలాఫలకాల రూపంలో భద్రపరుచుకునే వాళ్ళనెందర్నో చూశాం, చూస్తున్నాం. కానీ తను చేసిన తప్పు తన వాళ్ళెవరూ చేయకూడదని, ఆ తప్పుచేసిన అవయవాన్నే ఒక ఉదాహరణగా వదిలి వెళ్ళిపోయాడాయన.

నాకిప్పుడు బాగా అర్థమైపోయింది కానీ మాటలే రావడం లేదు. ఆయన ప్రక్కనే దోషిలా మౌనంగా ఉండలేకపోతున్నాను.

ఒకసారి నిదానంగా నావైపుచూసి మళ్ళీ చెప్పసాగాడాయన.

''ఒకరు చేసే పనులవల్ల వేరెవరికీ ఏ కొంచెం కష్టం గానీ నష్టంగానీ కలుగనంతవరకూ అవి వ్రేలెత్తి చూపతగ్గ తప్పులు కావు. మనం ఒక వ్రేలితో ఇతరుల తప్పుల్ని చూపిస్తే మూడు వ్రేళ్ళు మనని చూపిస్తాయంటారు కదూ?'' అంటూ నా వైపు చూశాడాయన.

''ఔను సార్'' అన్నాను బలవంతంగా.

''ప్లీజ్..మీరు ఫ్రీగా ఉండండి. మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం నా ఉద్దేశ్యం కాదు. ఓ ఫ్రెండ్‌గా నేను మంచి అనుకున్నది మీకు చెప్తున్నానంతే.. మీకు బాధ కలిగితే నన్ను క్షమించండి. కానీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి'' అంటూ కారు ఓ హోటల్ ముందు ఆపాడు. ''రండి'' అంటూ లోపలికి నడుస్తున్న ఆయన్ని నేను అనుసరించక తప్పలేదు. టిఫిన్-టీ ఆర్డర్ చేసి అవి తీసుకుంటున్నంతసేపూ ఆయన మౌనంగానే ఉన్నాడు. నాలో బిడియం పోగొట్టి ఫ్రీనెస్ తీసుకురావడానికే ఆయన అలా చేశారని అర్థమైంది. అయినా ఇబ్బందిగానే తిని త్రాగాను. మళ్ళీ మా ప్రయాణం ప్రారంభమైంది. కారు చాలా స్లోగా పోతోంది.

''ఇంటి విషయంలో మీరు అబద్ధం ఆడినప్పుడే మీరు కేవలం నా పరిచయం కోసమే వచ్చారన్న సంగతి అర్థమైపోయింది. కారణం కూడా తర్వాత తెలిసిపోయింది. చూడండి రంగారావుగారూ- బాబూరావుగారి చెల్లెలు ఎవరితోనో ఉంటోంది. అనే మాటకన్నా 'పాడైపోయిన గూడు విడచి మరోగూడు వెతుక్కుంది!' అనడంతో ఔచిత్యం లేదంటారా? అదే తప్పయితే మరి మీ రామలింగేశ్వర్రావుగారు చేయబోయింది ఏమిటి? స్వంత చెల్లెలి కూతురికి అన్యాయం! రెండోది. ఆ తప్పుకోసం మీచేత 'తప్పు' చేయించడం!'' అని నవ్వుతూ నా భుజం తట్టాడు.

నేను సిగ్గుతో తలవంచుకున్నాను. దీనికి కారణం ఏమిటి? ఒక మూర్ఖుడైన స్నేహితుడి సహవాసం కదూ!?

''మానవ శరీరంలో అన్నిటికన్నా చురుకైనది ఆ 'చూపుడువ్రేలే' రంగారావుగారూ. దాన్ని కంట్రోల్ చేయడం కష్టమే కానీ అసంభవం కాదు, ఔనంటారా?! సరే..ఇక అంతా మరిచిపోండి. నాకో మంచి స్నేహితుడిలా ఉండండి'' అంటూ తన చేత్తో నా చేతిని మృదువుగా నొక్కి వదిలాడు.

కారు మా యింటి ముందు ఆగింది. బలవంతంగా నవ్వడానికి ప్రయత్నిస్తూ..కారు దిగాను. ఆయన వెళ్ళబోతూ ఆగి పిలిచాడు.

''రెండు రోజుల్లో మూఢం వెళ్ళిపోతుందట. మంచిరోజు చూసుకుని అన్నమాట ప్రకారం బాబూరావుగారింటికే పిల్లని చూడ్డానికి వెళ్దాం అనుకుంటున్నాం. మా ఆవిడ రియలైజ్ అయింది లెండి'' అని నవ్వాడు చిన్నగా.

మరో విషయం..''మనూళ్ళో చాలా ఒబేసిటీ క్లినిక్స్ ఉన్నాయిగా డాడీ..!'' అంటున్నాడు మా అబ్బాయి కూడా! అంటూ పకపకా నవ్వి కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

నేను నిశ్చేష్టుడిలా నిలబడిపోయాను.

☆